

ప్రజాయుద్ధ నౌకకు ఘన నివాళి

ప్రజాయుద్ధ నౌక గద్దర్ రెండో వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం తెల్లాపూర్‌లోని ఆయన భారీ విగ్రహానికి ఘన నివాళులర్పించారు. గద్దర్ గళం అధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో విగ్రహం వద్ద గద్దర్ చిత్రపటానికి పూలమాల వేశారు. దళిత సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొని ఆయన పాటలను, సేవలను గుర్తుచేసుకున్నారు.

- రామచంద్రాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డి పట్టణంలోని జగ్గారెడ్డి ఇంట్లో ఆయన తనయ జయారెడ్డి పెళ్లి కూతురు వేడుకలో స్థానికులు



జయారెడ్డితో జగ్గారెడ్డి, నిర్మల, దత్తుసాయిరెడ్డి, కుసుమకుమార్

రామ్‌మందిర్‌లో నేడే జయారెడ్డి వివాహ వేడుక

● పెళ్లికూతురుని చేయడానికి తరలివచ్చిన జగ్గారెడ్డి శ్రేయోభిలాషులు, అభిమానులు

సంగారెడ్డి, ఆంధ్రజ్యోతి : నేడు సంగారెడ్డి రాంనగర్‌లోని రామ్‌మందిర్‌లో నిర్వహించనున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కూతురు జయారెడ్డి వివాహ వేడుకకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం రోజున జగ్గారెడ్డి ఇంటి వద్ద జయారెడ్డిని పెళ్లికూతురుగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమంలో జగ్గారెడ్డి శ్రేయోభిలాషులు, ఆయన అభిమానులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేయిస్తున్న సర్కారు స్థలంలోని అక్రమ నిర్మాణాలు

పటాన్‌చెరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇస్నాపూర్ గ్రామంలో ప్రభుత్వ స్థలాల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేశారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'సర్కార్ జాగా కబ్జా.. రాజకీయ దర్జా' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి నేరుగా రంగంలోకి దిగారు. ఉప తహసీల్దార్ సంతోష్‌ను క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని ఆక్రమణదారులను ఉపేక్షించవద్దని ఆదేశించారు. తక్షణం క్రిమినల్ కేసు నమోది చేయించాలని, నిర్మాణాలు తొలగించాలంటూ తెలిపారు. అనంతరం ఆర్‌ఐ ఖాజా ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో నిర్మాణాలను కూల్చివేయించారు.

పాముకాటుతో రెండేళ్ల చిన్నారి మృతి

● నాగిల్‌గిద్ద రేఖతండాలో ఘటన

భవనం పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

6

ఒకప్పుడు పర్యాటకులను ఆకట్టుకున్న తూప్రాన్ పట్టణంలోని పెద్దచెరువు ఇప్పుడు పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఏడేళ్ల క్రితం సుందరీకరణ కోసం ప్రతిపాదించిన నిధులు మంజూరు కాకపోవడంతో చెరువుకట్ట దుస్థితి మరింత దిగజారింది. పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన బోటు షికారు వారం రోజుల్లోనే మూసివేశారు. ఇప్పుడు చెరువుకట్టపైనే పశువుల సంత నిర్వహిస్తుండటంతో పర్యాటక ప్రాంతంగా మారాల్సిన పెద్దచెరువు దుస్థితిపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెద్దచెరువు చిన్నబోతోంది

- తూప్రాన్ పర్యాటక సొబగులపై నిర్లక్ష్యం
- సుందరీకరణ ప్రతిపాదనలు బుట్టదాఖలు
- మూన్నాళ్ల ముచ్చటగా బోటు షికారు

తూప్రాన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : గజ్వేల్‌లోని పాండవుల చెరువు తరహాలో ఇదే నియోజకవర్గం మెదక్ జిల్లా తూప్రాన్‌లోని పెద్దచెరువును కూడా సుందరీకరించాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకోవడంతో పర్యాటక శాఖ అధికారులు పలుమార్లు తూప్రాన్ పెద్దచెరువును సందర్శించారు. బోటింగ్, లైటింగ్, ఫౌంటైన్ వంటి పనులకు ప్రతిపాదనలు తయారు చేశారు. అదేవిధంగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో చెరువు కట్టపై సైడ్‌వాల్స్ నిర్మాణం, కట్ట వెనుక వైపు గ్రాస్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ పనుల కోసం 2018లో రూ.3.80 కోట్లు అవసరమని నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే, ఏడేళ్లు గడిచినా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదు.



పెద్దచెరువుపై బ్రిడ్జి నిర్మించనున్న స్థలం

వారం తిరగకుండానే



పెద్దచెరువులో ఏర్పాటు చేసిన బోటును తీసుకెళుతున్న సిబ్బంది

సుందరీకరణలో భాగంగా 2023లో పర్యాటక శాఖ బోటును ఏర్పాటు చేసింది. అప్పటి మున్సిపల్ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి ఈ బోటు షికారును ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ, వారం రోజులు తిరగకుండానే బోటును తీసుకెళ్లడంతో ప్రజలు నిరాశ చెందారు.

నిర్వహణ లేక..

2015-16లో ఇరిగేషన్ శాఖ రూ.5.20 కోట్ల నిధులతో చెరువు కట్టను వెడల్పు చేసింది. కానీ, ఆ తరువాత పనులు ముందుకు సాగలేదు. రెండేళ్ల క్రితం పీపీజీ నిధుల నుంచి మంజూరైన రూ.10 లక్షలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. అయితే, దాని నిర్వహణ సరిగా లేకపోవడంతో చెత్త నిండిపోయి నిరుపయోగంగా మారింది. పెద్దచెరువు కట్ట నిర్వహణ లేక గుంతలు పడి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

చెరువు కట్టపై పశువుల వార సంత

తూప్రాన్ పట్టణ పరిధిలో పశువుల సంత

మిగతా 8వ పేజీలో

రీసర్వే రికార్డులను జియోట్యాగింగ్ చేయాలి

● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య




ఇసుక బజార్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

జోగిపేట, ఆగష్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల భూభారతిలో భాగంగా చేపట్టిన రీసర్వేలోని రికార్డులనన్నింటినీ జియోట్యాగింగ్ చేయాలని సంబంధిత అధికారులను సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం ఆమె జోగిపేట ఆర్డీవో కార్యాలయంలో వట్‌పల్లి మండలం షాహెద్‌నగర్(గట్టుపల్లి)లో పైలెట్ ప్రాజెక్టుగా భూభారతి రీసర్వేపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సర్వేలో తేలిన ప్రతీ అంశాన్నీ పరిశీలించాలని, భవిష్యత్తులో ఎలాంటి భూసంబంధిత సమస్యలు ఉత్పన్నం కాకుండా పక్కాగా చేయాలన్నారు. భూభారతి రీసర్వే చేపట్టిన రికార్డులనన్నింటినీ కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. పహాణీలు, మోకా(పొజిషన్)పై ఉన్న రైతుల వివరాలు తదితర అంశాలపై ఆమె సూక్ష్మస్థాయిలో సమీక్ష జరిపారు. పనుల కోసం ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన ప్రజలతో కలెక్టర్ ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక కొరత ఉండొద్దు

అందోలు శివార్లలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ సాండ్ బజార్ (ఇసుక బజార్)ను బుధవారం కలెక్టర్ ప్రావీణ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకుంటున్న లబ్ధిదారులకు ఇసుక కొరత లేకుండా చూడాలని ఆమె అధికారులను ఆదేశించారు. కలెక్టర్ జోగిపేటలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ మాధురి, జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు ఐనేష్, ఆర్డీవో పాండు తదితరులు పాల్గొన్నారు.



పటాన్‌చెరులోని ఆచార్య జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, నాయకులు

ఆచార్యుడికి అంజలి

పటాన్‌చెరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : దివంగత ఆచార్య ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాలో నేతలు ఘన నివాళులర్పించారు. పటాన్‌చెరు పట్టణంలోని జయశంకర్ విగ్రహానికి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి, ఆయన సేవలను కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలకమైన పోషించిన ఘనత ఆచార్య జయశంకర్‌కు దక్కిందని ఎమ్మెల్యే అన్నారు.

చేనేతకు లినెన్ కళ

- దుబ్బాకలో సరికొత్త పంథాలో నేత కార్మికులు
- లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్‌తో అధునాతన డిజైన్లలో వస్త్రాల తయారీ
- దుబ్బాక చేనేత సహకార సంఘం పరిస్థితి ఇందుకు భిన్నం
- కనుమరుగవుతున్న గొల్లభామ చీర
- నేడు జాతీయ చేనేత దినోత్సవం

7





స్ఫూర్తి

వైకల్యాన్ని జయించి.. ఉద్యోగం సాధించి

- ఆత్మవిశ్వాసంతో పోటీపడి జూనియర్ లెక్చరర్‌గా జాబ్
- ఇడ్లీలు అమ్మి చదివించిన తల్లిదండ్రులు
- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న మఠం స్వామి రేవప్పయ్య

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఆత్మవిశ్వాసం, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించారు సంగారెడ్డికి చెందిన మఠం స్వామి రేవప్పయ్య. చిన్ననాటి నుంచే పోలియో, కండరాల క్షీణత వ్యాధి వెంటాడుతున్నా మొక్కవోనీ దీక్షతో చదివి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ఈ ఏడాది మార్చిలో రెగ్యులర్ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం చేరారు. ఓపెన్ కేటగిరిలో మల్టిజోన్-2 పరిధిలో ఆయన 3వ ర్యాంకు సాధించడం విశేషం. మఠం స్వామి రేవప్పయ్యది సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ధర్మాపూర్ స్వస్థలం. రేవప్పయ్య ఏడాది వయస్సున్నప్పుడే ఉపాధి కోసం వీరి కుటుంబం సంగారెడ్డికి వలస వచ్చారు. ఆయన విద్యాభ్యాసమంతా సంగారెడ్డి పట్టణంలోనే సాగింది. తండ్రి రాచయ్యస్వామి ఇడ్లీ బండి నడిపేవారు. అలా వచ్చిన డబ్బుతో కుమారుడు రేవప్పయ్యను ఎంఏ తెలుగు వరకు చదివించాడు. ప్రస్తుతం రేవప్పయ్య ఉస్మానియా యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పాఠాలు, పద్యాలు చక్కగా బోధిస్తూ విద్యార్థినులను తీర్చిదిద్దుతున్నారు.



సంగారెడ్డిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు పాఠాలు బోధిస్తున్న జూనియర్ లెక్చరర్ మఠం స్వామి రేవప్పయ్య

ప్రొఫెసర్ కావలన్నదే లక్ష్యం

కండర క్షీణతతో బాధపడుతున్న రోజూ తనను అమ్మ ఎత్తుకొని పాఠశాలలో 6వ తరగతి వరకు దింపేది. 7వ తరగతి నుంచి ట్రై సైకిల్‌పై వెళ్లి విద్యాభ్యాసం కొనసాగించారు. తను ఏ పనిచేయాలన్నా ఇతరుల మీద ఆధారపడాల్సిన పరిస్థితి. అయినా ఏ రోజూ అధైర్య పడలేదు. పట్టుదలతో చదువుకుని పోటీ పరీక్షల్లో తలపడి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించారు. ప్రొఫెసర్ కావలన్నదే తన లక్ష్యమని రేవప్పయ్య తెలిపారు. వైకల్యాన్ని జయించి ఉద్యోగం సాధించిన ఆయన జీవిత ప్రయాణం ఎందరికో స్ఫూర్తిదాయకం.

జీహెచ్‌ఎం పదోన్నతులకు బ్రేక్!

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియకు బ్రేక్ పడింది. జీహెచ్‌ఎం పదోన్నతి కోసం వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ బుధవారం ప్రారంభమైన కాసేపటికే ఉన్నతాధికారులు ఎంపిక నమోదును నిలిపేశారు. సీనియారిటీ జాబితాను సరిచేసే వరకు పదోన్నతుల వెబ్‌ఆప్షన్ల ప్రక్రియ నిలిపివేయాలని కొందరు ఉపాధ్యాయులు హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ వేయడంతో న్యాయస్థానం 11 వరకు ప్రక్రియ నిలుపుదల చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఆదేశాలు అందడంతో విద్యాశాఖ వెంటనే నిలిపివేయగా పదోన్నతుల ప్రక్రియకు బ్రేక్ పడింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో దొరికిన స్కూల్ బస్ డ్రైవర్

జగదేవ్‌పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట బుధవారం డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. ఈ టెస్టుల్లో మండల కేంద్రంలోని మాస్టర్ మైండ్ పాఠశాల బస్సు నడుపుతున్న డ్రైవర్ పరశురాములుకు డ్రంక్ టెస్ట్ నిర్వహించగా 216 ఎంజీ వచ్చింది. బస్సులో సుమారు 40 మంది వరకు విద్యార్థులు ఉన్నారు. పోలీసులు బస్సును సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇతరుల ప్రాణాలకు ప్రమాదకరంగా వ్యవహరించే వారిపై చట్ట ప్రకారం కఠినంగా వ్యవహరిస్తామన్నారు. స్కూల్ బస్సులు నడిపే డ్రైవర్‌లు అప్రమత్తంగా ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపి విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

జహీరాబాద్, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పట్టణంలో గోవిందాపూర్ క్రిష్ణ(45) అనే వ్యక్తి జూన్14న అదృశ్యమయ్యాడు. ఎస్సై వినయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందాపూర్ క్రిష్ణకు తనభార్యతో మనస్పర్థలు రావడంతో మూడేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి తన అన్న గోవిందాపూర్ వెంకట్ వద్దనే ఉంటున్నాడు. జూన్ 14న పనికి వెళ్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఇరుగు, పొరుగు వారి వద్ద, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అన్న వెంకట్ బుధవారం ఫిర్యాదుచేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అన్నారు. అలాగే అల్లీపూర్‌కు చెందిన షేక్‌మోహీజ్(29)ఈ నెల 5న ఇంటినుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయాడు. మూడు రోజులుగా ఇరుగుపొరుగు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించక పోవడంతో భార్య యాస్మీన్‌బేగం బుధవారం ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. ఈ వ్యక్తులు ఎక్కడైనా కనిపిస్తే జహీరాబాద్ పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



గోవిందాపూర్ క్రిష(ఫైల్), షేక్‌మోహీజ్ (ఫైల్)

వంట గ్యాస్ లీక్.. ముగ్గురికి గాయాలు

ఝరాసంగం, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఏడాకులపల్లి గ్రామంలో బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు ఇంట్లో వంట గ్యాస్ లీకేజీ కావడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామంలోని గొర్రెకంటి శంకరమ్మ ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. తల్లి కేకలు వేయడంతో అరుబయట ఉన్న ఇద్దరు కుమారులు ఇంట్లోకి రావడంతో వారికి కూడా గ్యాస్ తగిలి చేతులకు, కాళ్లకు గాయాలయ్యాయి.

అన్న ఇంట్లో తమ్ముడు చోరీ

దుబ్బాక, ఆగస్టు6(ఆంధ్రజ్యోతి): దుబ్బాక మున్సిపల్ మల్లాయపల్లి వార్డులో అన్న ఇంట్లో దొంగతనం చేశాడు ఓ తమ్ముడు. అయితే ఎనిమిదినెలల తర్వాత బుధవారం సోదరుడిని పోలీసులు పట్టుకున్నారు. దుబ్బాక ఎస్సై కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాయపల్లి గ్రామానికి చెందిన కీసరి రమేష్ ఇంట్లో గత జనవరి 15న దొంగతనం జరిగి, పావుతులం బంగారం, నాలుగు తులాల వెండి, 15వేల నగదు దొంగలించారు. రమేష్ ఇచ్చిన ఫిర్యాదుతో విచారణ జరిపిన పోలీసులు ఎనిమిది నెలలకు తమ్ముడు కీసరి రాజును పట్టుకున్నారు. అతడిని విచారించగా, తాను వ్యసనాలకు బానిసై, తాగడానికి తాను దొంగతనం చేసినట్లు అంగీకరించాడు. పోలీసులు అరెస్టుచేసి, నిందితుడిని రిమాండ్‌కు పంపించారు.

1.45 గ్రాముల ఎండు గంజాయి పట్టివేత

మునిపల్లి, ఆగస్టు6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా సరఫరా చేస్తున్న ఎండు గంజాయిని కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టుకున్నారు. ప్రొహిబీషన్, ఎక్సైజ్ జిల్లా అధికారి నవీన్ చంద్ర ఆదేశాల మేరకు బుధవారం మునిపల్లి మండలం కంకోల్ టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్ శాఖ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ కారుపై అనుమానం రావడంతో ఆపి తనిఖీ చేయగా అందులో 1.45గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఇస్నాపూర్‌కు చెందిన వీరేష్, సాయికిరణ్ రెడ్డి, రాహుల్ అనే ముగ్గురు ఎండు గంజాయిని బీదర్‌లో తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లు వారు ఒప్పుకున్నారని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. 1.45గ్రాముల ఎండు గంజాయితోపాటు స్విఫ్ట్ కారు, నాలుగు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించినట్లు డీటీఎఫ్ ఎస్సై హనుమంత్ తెలిపారు. ఈదాడుల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్స్ అంజిరెడ్డి, తదితరులు ఉన్నారు.

పాముకాటుతో రెండేళ్ల చిన్నారి మృతి



రోహిత్(ఫైల్)

నాగల్‌గిద్ద, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో బాలుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని మెదక్ జిల్లా నాగిల్‌గిద్ద రేఖతండాలో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన వెంకట్, లక్ష్మీబాయిల కుమారుడు రోహిత్(2) ఇంటి ఎదుట ఆడుకుంటున్నాడు. తండ్రి వ్యవసాయ పనులకు వెళ్లగా, తల్లి ఇంట్లో పనులు చేసుకుంటోంది. ఈ సమయంలో చిన్నారిని పాము కాటు వేసింది. బాబు ఏడుస్తుండటంతో తల్లి బయటకు వచ్చి చూడగా పాము కాటు వేసినట్లు తెలిసింది. వెంటనే కుటుంబీకులు, నారాయణఖేడ్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.

భవనంపై నుంచి పడి వ్యక్తి..

● మరొకరికి తీవ్రగాయాలు

పెద్దశంకరంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనంపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బుధవారం పెద్దశంకరంపేటలో జరిగింది. పెద్దశంకరంపేటకు చెందిన ఎండీ జావిద్(40) తిరుమలాపూర్‌లో తన ఇంటి నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. భవనంపై ఉన్న సామగ్రిని చేరవేసే క్రేన్‌ను జావిద్, అతడితో పాటు భవన నిర్మాణ కార్మికుడు పాపన్నపేట మండలం చీకోడ్ గ్రామానికి చెందిన శంకర్‌తో కలిసి సరి చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి ఇద్దరు కింద పడి పోయారు. ఈ క్రమంలో జావిద్‌కు తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. శంకర్‌కు తీవ్ర గాయాలు కావడంతో సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అల్లాదుర్గం ఎస్సై శంకర్ పేట ఏఎస్సై సంగమేశ్వర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



చాపల మహేష్ (ఫైల్)

హవేళిఘణపూర్, ఆగస్టు 6;(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనాల ప్రకారం.. జక్కన్నపేట గ్రామానికి చెందిన చాపల మహేష్(26) వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. కుటుంబపోషణ, వ్యవసాయ పెట్టుబడులకు అప్పులు చేసాడు. ఈ అప్పులు ఎలా తీర్చాలోనని కుటుంబీకులకు చెప్పుకుంటూ బాధపడుతుండేవాడు. ఆదివారం ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే మెదక్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గాంధీ హస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సంతోషి, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి తండ్రి శంకరయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఏఎసై రాజు తెలిపారు. కాగా పెద్ద కూతురికి కళ్లు కనబడవు, చిన్న కుమార్తెకు ఎడమ చేయి మణికట్టు వరకు లేదు. ఈ దివ్యాంగులైన వారిని సాకేవారు ఎవరని కుటుంబీకుల రోదనలు మిన్నంటినాయి.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం.. ఎద్దు మృతి



విద్యుత్ షాక్‌తో సజీవ దహనమౌతున్న ఎద్దు

మనూరు, ఆగస్టు 6(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎద్దు షార్ట్ సర్క్యూట్‌తో సజీవ దహనమైంది. ఈ సంఘటన బుధవారం మనూరు మండలం రాయిపల్లిలో జరిగింది. ఇందుకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామంలోని హుస్సేన్‌కు చెందిన ఎద్దు మేత మేసుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరికి వెళ్లింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి ఎద్దు అక్కడికక్కడే సజీవ దహనమై మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచ ఏర్పాటు చేయక పోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.80 వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి మండలంలోని ప్రతి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచ ఏర్పాటు చేసి నష్టపోయిన రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రంగనాయక సాగర్‌లో మహిళ శవం లభ్యం

సిద్దిపేట క్రైం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రంగనాయక సాగర్ కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన సిద్దిపేట బుధవారం పట్టణ శివారులో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... సిద్దిపేట పట్టణ శివారు రంగనాయక సాగర్ కాలువలో మహిళ మృతదేహం ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి సిద్దిపేట ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతిచెందిన మహిళ ఇమాంబాద్‌కు చెందిన రాణి (37)గా గుర్తించారు. మృతురాలు వ్యవసాయ పనులు చేసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. మహిళ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

ఘన నివాళి



ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకుడు నీలం మధు ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే గద్దర్ రెండవ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.
- పటాన్ చెరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జయశంకర్ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.
- మెదక్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయశంకర్ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ కె. హైమావతి ముఖ్యఅతిథిగా పాల్గొని నివాళులర్పించారు.
- సిద్దిపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి)



ఎంఎస్ఆర్ యూనివర్సిటీని సందర్శించిన బ్రిటీష్ డిప్యూటి హై కమిషనర్

భారత, బ్రిటన్ విశ్వవిద్యాలయాల మధ్య సహకారం విస్తరించాలి

● బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్ పిలుపు

సంగారెడ్డి రూరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): భారత, బ్రిటన్ విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించాలని బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ గరెత్ విన్ ఓవెన్ అన్నారు. బుధవారం ఆయన సంగారెడ్డి మండలం, ఫసల్వాది గ్రామ పరిధిలోని ఎంఎస్ఆర్ యూనివర్సిటీని సందర్శించారు. విద్యారంగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాల ప్రాముఖ్యత పెరుగుతోందని, రెండు దేశాల విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడం చాలా కీలకమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొ. కృష్ణచలం, రిజిస్ట్రార్ ప్రొ. సత్యనారాయణ, ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డా. కిరణ్, మెడికల్ అండ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ డీన్ డా. వెంకటరమణ, అకడమిక్స్ డీన్ డా. రవి, సీనియర్ సైంటిస్ట్ డా. షహీలా పర్వీన్, హాస్పిటల్ సీఈవో సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులతో మాట్లాడుతున్న తహసీల్దార్

మద్దూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని లద్నూర్ రిజర్వాయర్‌ను నింపి, చెరువులు, కుంటల్లోకి నీళ్ల మళ్లించి రైతులకు సాగునీరు అందించాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొంగోని సురేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మద్దూరులో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేశ్‌గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కూడా నియోజకవర్గ రైతులకు సాగునీరు విడుదల చేయించడంలో విఫలమయ్యారని విమర్శించారు. ధర్నా జరుగుతున్న విషయం తెలుసుకున్న ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ స్థానిక తహసీల్దార్ రహీంకు సమాచారం ఇవ్వగా, ఆయన అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలపై లిఖితపూర్వకంగా వినతి పత్రాన్ని అందించాలని సూచించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తానని చెప్పడంతో కార్యకర్తలు వినతిపత్రాన్ని అందించి ధర్నా విరమించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేక సుదర్శన్, బాలకృష్ణ, బొల్లు రాజు, సందీప్, సాయి, శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహితది హత్యంటూ ఆందోళన

● తూప్రాన్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత



తూప్రాన్ సర్కిల్ కార్యాలయం వద్ద గుమిగూడిన జనం

తూప్రాన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): వివాహితను అత్తింటివార హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు బుధవారం ఆందోళనకు దిగారు. దీంతో తూప్రాన్ సర్కిల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. దౌల్తాబాద్ మండలం, ఎల్కంటి గ్రామానికి చెందిన నాగరాణి, శివ్వంపేట మండలం, చండి గ్రామానికి చెందిన సత్యనారాయణతో వివాహం జరిగింది. మంగళవారం కుటుంబ కలహాల కారణంగా నాగరాణి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అయితే, నాగరాణిని హత్య చేశారని ఆరోపిస్తూ ఆమె పుట్టింటి బంధువులు మంగళవారం చండి గ్రామంలో సత్యనారాయణ ఇంటిపై దాడి చేశారు. బుధవారం ఎల్కంటి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు, పురుషులు తూప్రాన్ సర్కిల్ కార్యాలయానికి వచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు, సీఐ రంగ కృష్ణ, ఎస్ఐ శివానందం వారిని సముదాయించారు. ఇరు కుటుంబాలకు చెందిన పెద్ద మనుషుల మధ్య చర్చలు జరిపేందుకు పోలీసులు ఏర్పాట్లు చేశారు. దీంతో ఆందోళనకారులు శాంతించి పోలీసు స్టేషన్ ఆవరణలో కూర్చున్నారు. రాజీ కోసం ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి.

మహాధర్నాను విజయవంతం చేయాలి



కలెక్టరేట్ వద్ద మహాధర్నా ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

మెదక్ మున్సిపాలిటీ, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిరసిస్తూ నిర్వహించే రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఇఫ్కో మాజీ డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి ధర్నా చౌక్ వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సన్న వడ్లకు బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, రుణమాఫీ, ఇతర హామీలను విస్మరించిందని విమర్శించారు. రైతు ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం సాగిస్తుందని ఆయన చెప్పారు. ఈ మహాధర్నాకు మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, నిరంజనరెడ్డిలు హాజరవుతున్నట్లు తెలిపారు. ధర్నా చౌక్‌ను పరిశీలించిన వారిలో మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లిఖార్జున గౌడ్, నాయకులు భీమరి కిశోర్, గంగా నరేందర్, లింగారెడ్డి, ప్రభురెడ్డి, సోములు, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

చేనేతకు లినెన్ కళ

పోటీ ప్రపంచంలో నిలబడేందుకు సరికొత్త పంథాలో చేనేత కార్మికులు

- లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్‌తో అధునాతన డిజైన్లలో చీరల తయారీ
- నెలకు రూ.25వేల నుంచి 30 వేల వరకు సంపాదన
- దుబ్బాక చేనేత సహకార సంఘం పరిస్థితి ఇందుకు భిన్నం
- తరాలుగా వస్తున్న గొల్లభామ చీర కనుమరుగు



దుబ్బాకలో చేనేత లినెన్ వస్త్రాల తయారీ

నేడు జాతీయ చేనేత దినోత్సవం

దుబ్బాక, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ఒకప్పుడు రంగుల ప్రపంచానికి పేరుగాంచిన దుబ్బాక చేనేత పరిశ్రమ, నేడు కన్నీటి గాథలకు నిలయంగా మారింది. దశాబ్దం క్రితం చేనేత కార్మికుల ఆత్మహత్యలకు దుబ్బాక ఒక ఉదాహరణగా నిలిచింది. సుమారు 112 చేనేత కుటుంబాలు ఆకలిచావులు, ఆత్మహత్యలకు బలైపోయాయి. వేలాది మంది కార్మికులు వృత్తిని వదిలి, సోలాపూర్, భీమండి, నాందేడ్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లారు. మిగిలిన కొందరు చేనేత సహకార సంఘంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, సంఘం కూడా ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడంతో వారికి సరైన ఉపాధి దొరకడం లేదు. దీంతో దుబ్బాక చేనేత కార్మికులు మూడు భిన్నమైన పరిస్థితుల్లో తమ జీవితాలను వెళ్లదీస్తున్నారు. నేడు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా దుబ్బాక చేనేత కార్మికుల స్థితిగతులపై ప్రత్యేక కథనం.

కొత్త పంథాలో చేనేత కళాకారులు

సంక్షోభం నుంచి బయటపడాలని నిర్ణయించుకున్న కొంతమంది చేనేత కార్మికులు తమ వృత్తిని కాపాడుకునేందుకు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. వీరంతా కలిసి దుబ్బాక హ్యాండ్లూమ్ ప్రొడ్యూసర్ కంపెనీని స్థాపించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో శిక్షణ పొందిన ఈ కార్మికులు, మార్కెట్ డిమాండ్‌ను బట్టి లినెన్ వస్త్రాల తయారీని ఎంచుకున్నారు. మొదట్లో తువ్వాళ్లు, రుమాళ్లు తయారు చేసిన వీరు, క్రమంగా లినెన్ ఇక్కత్ ఫ్యాబ్రిక్ (100 శాతం లినెన్) చీరలను తయారు చేయడం ప్రారంభించారు. డిజైనర్ల సహాయంతో కలకత్తా బ్లాక్ ప్రింట్, జైపూర్ బ్లాక్ ప్రింట్ బగ్రులను తయారు చేస్తున్నారు. హన్మకొండ, బెంగళూరు, ధార్వాడ్ వంటి ప్రాంతాల నుంచి కసూతి హ్యాండ్ ఎంబ్రాయిడరీ, లక్నో నుంచి చికెన్‌కరీ ఎంబ్రాయిడరీ చేయించి మరింత ఆకర్షణను జోడిస్తున్నారు.

నెలకు రూ.30 వేలు..

గతంలో రోజుకు కేవలం రూ. 50 కూలి కూడా దొరకని పరిస్థితి నుంచి, ఇప్పుడు లినెన్ ఇక్కత్ చీరల తయారీ ద్వారా ఒక్కో కార్మికుడు నెలకు రూ. 25వేల నుంచి రూ.30 వేల వరకు సంపాదిస్తున్నారు. ఈ కళాకారుల కృషికి గుర్తింపుగా, అయోధ్య రామాలయ ట్రస్ట్ బాలరాముడి అలంకరణ కోసం వీరు నేసిన లేత గులాబీ రంగు వస్త్రాలను ఆమోదించింది. మార్కెటింగ్‌కు సోషల్ మీడియాను, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లను వేదికగా చేసుకుంటున్నారు.

కనుమరుగవుతున్న గొల్లభామ చీర

చేనేత వృత్తిలో దుబ్బాకకు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చిన అరుదైన కళ 'గొల్లభామ చీర' నేడు కనుమరుగు అంచున ఉంది. 70 ఏళ్ల క్రితం కలకత్తా నుంచి నేర్చుకున్న వారు ఈ చీరను నేసేవారు. ప్రస్తుతం ఒకరిద్దరు మాత్రమే మిగిలారు. దుబ్బాకకు చెందిన 71 ఏళ్ల లొంక బాలయ్య తన తండ్రి నుంచి నేర్చుకున్న ఈ కళను ఇంకా కొనసాగిస్తున్నారు. 15 నుంచి 20 రోజులు కష్టపడి ఒక చీరను నేయాల్సి ఉండటం, తగిన ప్రోత్సాహం లేకపోవడంతో ఈ కళపై కొత్త తరం ఆసక్తి చూపడం లేదు. తన తండ్రి వారసత్వాన్ని వదలలేనని చెప్పే బాలయ్య కృషిని ప్రభుత్వం ఇప్పటివరకు గుర్తించలేదు. తన తర్వాత ఈ కళను కొనసాగించేవారు లేకపోవడంతో, ఈ అద్భుతమైన కళ చరిత్రలో కలిసిపోయే ప్రమాదం ఏర్పడింది.





దుబ్బాక చేనేత సహకార సంఘంలో పని చేస్తున్న కార్మికులు

అప్పుల ఊబిలో చేనేత సహకార సంఘం

ఒకప్పుడు 6 వేల మందికి ఉపాధి కల్పించిన దుబ్బాక చేనేత సహకార సంఘం నేడు అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2018లో నాటి మంత్రి కేటీఆర్ సంఘాన్ని సందర్శించి, ప్రభుత్వం తరఫున రుణం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. 2019లో రూ. 52 లక్షల రుణం లభించినప్పటికీ, ఇది పాత అప్పులు తీర్చడానికే సరిపోయింది. ప్రభుత్వం నుంచి మరింత సాయం అందకపోవడంతో, అప్పులు పెరుగుతూ పోయాయి. ప్రస్తుతం సంఘం అప్పు రూ.1.10 కోట్లకు చేరింది. దీంతో కార్మికులకు తగినంత పని కల్పించలేక, వారి జీవితాలు అగమ్యగోచరంగా మారాయి.

నర్సారెడ్డి దళిత పక్షపాతి

● కాంగ్రెస్ పార్టీ నాయకులు



గజ్వేల్ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

గజ్వేల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి దళిత పక్షపాతి అని వర్గల్ మాజీ ఎంపీపీ భాగనేళ్ల మోహన్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని నర్సారెడ్డి ఇంటి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్, హరీశ్‌రావులతో పోరాడిన నర్సారెడ్డి తమ ఆధిపత్యానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతో మైనంపల్లి హనుమంతరావు కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే అయిన నర్సారెడ్డి రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో స్టేజీ ఎక్కలేదని, కానీ ప్రోటోకాల్ లేని విజయ్ స్టేజీ ఎక్కి హంగామా సృష్టించారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కొడకండ్ల నర్సింహులు, తూప్రాన్ అనిల్, లకుడారం అండాలమ్మ, కొత్తూరు వీరేశం, తూప్రాన్ వెంకటస్వామి, ప్రజ్ఞాపూర్ శివులు, యాదగిరి, మహేందర్, శ్రీనివాస్, వెంకటేష్, మల్లికార్జున, రత్నాకర్, బాబు, గణేశ్, సురేశ్, బాలు, దయ్యాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పరువు తీస్తున్న బీఆర్ఎస్ కోవర్టులు

కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీశ్‌రావుతో కుమ్మక్కై పార్టీ పరువు తీస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి ఆరోపించారు. గజ్వేల్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, స్వప్రయోజనాల కోసం మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మైనంపల్లి హనుమంతరావును విమర్శించే స్థాయి గజ్వేల్ నాయకులకు లేదని, గతంలో నియోజకవర్గంలో పార్టీ కార్యకర్త చనిపోతే పరామర్శించని వ్యక్తులు కూడా ఇప్పుడు తామే నాయకులమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. దళితుడిపై దాడి జరిగితే సంఘటితం కావాల్సిన వారే ఇలా ప్రెస్‌మీట్లు పెట్టి మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని..

● యువకుడి ఆత్మహత్యాయత్నం



జాతీయ రహదారిపై నిరసన తెలుపుతున్న శ్రీకాంత్ యాదవ్

నంగునూరు, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అన్ని అర్హతలు ఉన్నా ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాకపోవడంతో సిద్దిపేట జిల్లా, నంగునూరు మండలం, పాలమాకుల గ్రామానికి చెందిన వరదోలు శ్రీకాంత్ యాదవ్ అనే వ్యక్తి బుధవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామంలో తన ఇల్లు శిథిలావస్థకు చేరడంతో అద్దె ఇంట్లో ఉంటున్న శ్రీకాంత్, ఇందిరమ్మ ఇల్లు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నాడు. అధికారులు విచారణ చేపట్టి అర్హుల జాబితాలో అతని పేరు చేర్చారు. మొదటి విడతలో అతని పేరు రాలేదు. దీంతో కలత చెందిన శ్రీకాంత్ హనుమకొండ-సిద్దిపేట జాతీయ రహదారిపై పాలమాకుల బస్ స్టాప్ వద్ద బైఠాయించి, పెట్రోల్ తాగుతూ కొంత ఒంటిపై పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా స్థానికులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సరిత గ్రామానికి చేరుకొని బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. పోలీసులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై మండల ప్రత్యేక అధికారి, డీపీవో దేవకిదేవిని వివరణ కోరగా, శ్రీకాంత్ పేరు మీద ప్రజాపాలనలో ఎలాంటి దరఖాస్తు లేదని, అతని తల్లి బుచ్చవ్వ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. రెండో విడతలో బుచ్చవ్వకు ఇల్లు ఇచ్చే విషయం పరిశీలనలో ఉందని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ఎవరూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదని, అర్హులైన వారందరికీ విడతలవారీగా మంజూరు చేస్తామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్



ప్రదర్శనను తిలకిస్తున్న వక్తలు, ముఖ్య అతిథులు



మొక్కలకు క్యూఆర్ కోడ్

సిద్దిపేట కల్చరల్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోరింగ్ ది బొటానికల్ వరల్డ్, ఏ హ్యాండ్స్ ఆన్ అడ్వెంచర్' పేరుతో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగే ఈ కార్యశాలలో భాగంగా బుధవారం జరిగిన సమావేశానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. సునీత అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన ఎన్ఆర్ఎస్‌సీ శాస్త్రవేత్త డా. సుధాకర్ రెడ్డి మొక్కల పరిణామం, భవిష్యత్తు గురించి, వాటిని గుర్తించడానికి ఉపయోగించే సాంకేతిక పరికరాలైన జీపీఎస్, జీఐఎస్ గురించి వివరించారు. అనంతరం, రిటైర్డ్ ఎమినెంట్ ప్రొఫెసర్ వాత్సవాయ ఎస్ రాజు మొక్కల వర్గీకరణపై, కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ డా. ఇ. నరసింహమూర్తి జీవ వైవిధ్యం, సంరక్షణ పద్ధతుల గురించి వివరించారు. కళాశాలలోని మొక్కలకు ప్రత్యేకమైన క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి, సీవోఈ డా. గోపాల సుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ మధుసూధన్, కార్యశాల కన్వీనర్ డా. రాణి కొమ్మిడి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డా. శైలజ, కోకన్వీనర్‌లు డా. మీరాజ్ ఫాతిమా, స్రవంతి, మోతుకు శ్రీనివాస్, దువ్వల శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గుబ్బా కోల్డ్‌స్టోరేజ్‌లో భారీ అగ్నిప్రమాదం

గుమ్మడిదల ఆగస్టు,6 (ఆంధ్రజ్యోతి); గుమ్మడిదల పీఎస్ పరిధిలోని అన్నారం పరిధిలో అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. అన్నారం నుంచి జిన్నారం వెళ్లే ప్రధాన రహదారి పక్కనే గల గుబ్బా కోల్డ్ స్టోరేజ్‌లో రాత్రి 9 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మంటల సెగ సమీపంలోని అన్నారం, జంగంపేట గ్రామాలకు తాకడంతో ప్రజలు ఒక్కసారిగా బయటకు వచ్చి భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికుల నుంచి విషయం తెలుసుకున్న గుమ్మడిదల పోలీసులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో జీడిమెట్ల, నర్సాపూర్, పటాన్‌చెరు, గడ్డపోతారం ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. ఈ అగ్ని ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. కానీ భారీగా ఆస్తినష్టం జరిగింది. ఈ ప్రమాదంపై స్థానికులు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు. స్టోరేజీ యాజమాన్యం ఇన్సూరెన్స్ కోసం కావాలనే స్టోరేజీని తగలబెట్టిందని ఆరోపించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉన్నది.



ఎగిసి పడుతున్న మంటలు


జహీరాబాద్ : ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, తదితరులు


సంగారెడ్డిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్


నారాయణఖేడ్ : ఆచార్య జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్, అధికారులు

జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి


కంది : ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో, సిబ్బంది

ఆచార్య జయశంకర్ జయంతిని మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర సాధన కోసం ఆయన ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. ఆయా కార్యక్రమాలలో ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

- న్యూస్ నెట్‌వర్క్


మెదక్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు


మెదక్ అర్బన్ : టీఎన్జీవో భవన్‌లో జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్


తూప్రాన్ ఆర్డీవో కార్యాలయం వద్ద జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి, తదితరులు


వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

ఆర్థిక పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న ఆర్థికపథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ నర్సింగరావు పేర్కొన్నారు.బుధవారం మండలంలోని మల్‌చెల్మ గ్రామంలో గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆర్థిక పథకాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

'డ్రైడే' సక్రమంగా అమలు చేయాలి

తూప్రాన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ మండలం వెంకటాయపల్లిలో శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమం పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో సతీష్, కార్యదర్శి ఉన్నారు.

ఆకుపచ్చ తెలంగాణే అందరి కర్తవ్యం : కలెక్టర్

నర్సాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ రహిత ఆకుపచ్చ తెలంగాణగా తీర్చిదిద్దడమే మనందరి కర్తవ్యమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులతో కలిసి వన మహోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అదే విధంగా సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మాట్లాడారు. వనమహోత్సవంలో భాగంగా కాలేజీ ప్రాంగణంలో వేయి మొక్కలు నాటామన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను నాటి వాటి సంరక్షణకు వారే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్, ఇంటర్మీడియట్ అధికారి మాధవి పాల్గొన్నారు.

రెడ్డిపల్లి పీహెచ్‌సీ సేవలు భేష్

నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి సమీపంలోని పీహెచ్‌సీలో వైద్య సేవలు బాగున్నాయని కలెక్టర్ రాహుల్‌రాజ్ అభినందించారు. రెడ్డిపల్లి పీహెచ్‌సీని కలెక్టర్ సందర్శించి వైద్య సేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, డెలివరీ రిజిస్టర్, మందుల స్టాకు వివరాలు చూశారు. గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులను, పారిశుధ్యం తీరును పరిశీలించారు.


రెడ్డిపల్లి పీహెచ్‌సీలో మందుల స్టాకును పరిశీలిస్తున్న రాహుల్‌రాజ్

పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి

మెదక్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ వేడులకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 15న ఉదయం జిల్లా పోలీసు కార్యాలయం మైదానంలో జరిగే వేడుకల్లో పోలీస్ గౌరవ వందన స్వీకరణ, బందోబస్తు ఏర్పాట్లను నిర్వహించాలని, ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కులసంఘాలకు ప్రాధాన్యత : ఎమ్మెల్యే

రామచంద్రాపురం టౌన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : కుల సంఘాలకు ప్రాధాన్యత ఇచ్చి పెద్దఎత్తున భవనాలు నిర్మించి ఇచ్చామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం తెల్లాపూర్ పురపాలక పరిధి ముత్తంగి గ్రామంలో వీరభద్రీయ కుల సంఘం భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అలానే పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సైతం శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని కులాలకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా భవనాలు నిర్మించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉపేందర్, సిల్వర్‌శ్రీను, మేరాజ్‌ఖాన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలి


జీజీహెచ్‌లో రోగుల డైట్‌ను పరిశీలిస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : రోగులకు నాణ్యమైన పోషకాహారాన్ని అందించాలని సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బి.సౌజన్య ఆదేశించారు. సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రోగులకు అందించే డైట్‌ను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అనంతరం రోగులకు ఇచ్చే ఆహార నాణ్యతను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.మురళీకృష్ణ, ఆర్‌ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్ పాల్గొన్నారు.

సకాలంలో వైద్య సేవలందించాలి


అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సంగారెడ్డి

కోహీర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందించాలని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త సంగారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కోహీర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి మాట్లాడారు. వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్య సిబ్బంది వారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రి లోపల ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ వరుణ్, వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఉపాధిహామీ పనులపై ప్రజావేదిక

వెల్దుర్తి, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి ఈజీఎస్ కార్యాలయంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను బుధవారం నిర్వహించారు. ఈ వేదికలో ఏపీడీ రంగాచార్యులు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. వెల్దుర్తి ఉమ్మడి మండలంలోని గ్రామాల్లో 1 ఏప్రిల్ 2024 నుంచి 31 మార్చి 2025 వరకు చేపట్టిన పనులకు సంబంధించిన నివేదికలను తనిఖీ బృందం చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ఉమ్మడి వెల్దుర్తి మండలంలో రూ.9 కోట్ల 90 లక్షల 3046 పనులు నిర్వహించారన్నారు. తనిఖీలో గుర్తించిన తప్పులకుగాను రూ.59,495 రికవరీ చేయాలని, రూ.20 వేలను సిబ్బందికి జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఆర్ రాజేందర్‌రెడ్డి, ఎస్ఆర్పీ పాండురంగారావు, ఎంపీడీవోలు ఉమాదేవి, విఘ్నేశ్వర్, ఏపీవో రాజు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

రామాయంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : భూభారతి రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా కృషి చేయాలని ఆర్డీవో రమాదేవి సూచించారు. బుధవారం రామాయంపేటలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి, రెవెన్యూ సదస్సు దరఖాస్తుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముందుగా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాల శుభ్రతలపై ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రజినికుమారి, మున్సిపల్ కమిషనర్ ఎం.దేవేందర్ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి


నర్సాపూర్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నర్సాపూర్/రామచంద్రాపురం/వట్‌పల్లి/ ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ప్రజాగాయకుడు గద్దర్ వర్ధంతిని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సాపూర్ బస్టాండ్ సమీపంలోని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.మల్లేశం, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సంజీవ తదితరులు పాల్గొన్నారు. రామచంద్రాపురంలో గద్దర్ గళం అధ్యక్షుడు కొల్లూరి సత్తయ్య, మాజీ కౌన్సిలర్ కొల్లూరి భరత్ ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతి నిర్వహించారు. తెల్లాపూర్‌లోని గద్దర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు, అభిమానులు పూలమాలవేసి నివాళులర్పించారు. వట్‌పల్లిలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘాల ఆందోల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి దాసు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు జనార్ధన్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రకాశం పాల్గొన్నారు.

'ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను నిర్వహించాలి'

చిన్నశంకరంపేట/నిజాంపేట, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రీ ప్రైమరీ పీఎంశ్రీ విద్యను ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాల్లోని నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి అన్నారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి తహసీల్దార్ మాలతికి వినతిపత్రం అందజేశారు. నిజాంపేటలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు బాలమణి ఆధ్వర్యంలో ఎంపీడీవో రాజిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

- సంగారెడ్డి అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్ వైద్యులు డా.చక్రపాణి


సంగారెడ్డి ఎంసీహెచ్‌లో అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.చక్రపాణి

సంగారెడ్డి అర్బన్/మునిపల్లి/నాగల్‌గిద్ద/అల్లాదుర్గం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : బిడ్డ పుట్టిన ఆరునెలల వరకూ తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని పీడియాట్రిక్ వైద్యులు డా.సి.చక్రపాణి సూచించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సంగారెడ్డి అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్, మెడికల్ కళాశాల పీడియాట్రిక్ విభాగం, ప్రసూతి విభాగం సంయుక్తంగా తల్లిపాల ప్రాముఖ్యతపై బుధవారం సంగారెడ్డిలోని ఎంసీహెచ్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీడియాట్రిక్ హెచ్‌వోడీ డా.షబ్బీర్, డా.శ్రీనివాస్, డా.రాధిక, నర్సింగ్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు. మునిపల్లి మండలం పెద్దచెల్మెడలో అంగన్‌వాడీ టీచర్ రేణుక ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడారు. నాగల్‌గిద్ద మండలం దామర్‌గిద్దలో, అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లాదుర్గం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

జహీరాబాద్/నర్సాపూర్/అల్లాదుర్గం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై యువత అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి. జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ పేర్కొన్నారు. సైబర్ జాగృకత దివాస్ సందర్భంగా బుధవారం పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, హోతి(కే) శివారులో గల బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ ఎస్‌ఐ కాశీనాథ్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిరాగ్‌పల్లి ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నర్సాపూర్‌లోని ఎల్లంకి డిగ్రీ కాలేజీలో సైబర్ నేరాలపై సైబర్ క్రైం డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ లింగం, ప్రిన్సిపాల్ అశోక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్‌ఐ శంకర్ సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

పెద్దచెరువు చిన్నబోతోంది

(5వ పేజీ తరువాయి)


పెద్దచెరువు కట్టపై నిర్వహిస్తున్న పశువుల సంత

నిర్వహించడానికి సరైన స్థలం లేకపోవడంతో నిర్వాహకులు ఏకంగా పెద్దచెరువు కట్టపైనే వారపు సంతను ఏర్పాటు చేశారు. ప్రతీ మంగళవారం ఇక్కడ సంత నిర్వహిస్తుండటంతో పర్యావరణం దెబ్బతింటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పెద్దచెరువు సుందరీకరణ పనులు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు : ఎమ్మెల్యే

జహీరాబాద్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయడం తగదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పేర్కొన్నారు. ఝరాసంగం మండలం ఏడాకులపల్లి గ్రామంలో వంటగ్యాస్ పేలుళ్ల ఘటనలో గాయాలకు గురైన గొర్రెకంటి శంకరమ్మ, ప్రభు, విఠల్ బుధవారం చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా క్షతగాత్రులను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యమందించేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఝరాసంగం మండల అధ్యక్షుడు వెంకటేశం, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో గోదావరిఅంజిరెడ్డి

అమీన్‌పూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడా సిద్ధార్థ ఎన్‌క్లేవ్ కట్టమైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరిఅంజిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఈర్లరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలి

- పంచాయతీ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

కొండాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గంగారం గ్రామంలో ఖాళీ స్థలాలు ఉండి పట్టా కలిగిన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు మాణిక్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఇంటి పట్టాలిచ్చి పొజిషన్ చూపిన లబ్ధిదారులకు నిర్మాణానికి అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. తహసీల్దార్ అశోక్ కలుగచేసుకుని ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం 15న పరిశీలించి అనుమతులు ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ధర్నా విరమించారు.

పర్యావరణ పరిరక్షణకు కదిలిన వృద్ధులు

రామచంద్రాపురం, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరిక్షణకు విశ్రాంత ఉద్యోగులు నడుం బిగించారు. తెల్లాపూర్‌లోని మైఫేర్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసముంటున్న మేఫేర్ 60 ప్లస్ క్లబ్ సీనియర్ సభ్యులు ప్రతీ బుధవారం రహదారుల ఇరుపక్కల ఉన్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్నారు. చెత్త తొలగింపునకు కావాల్సిన వస్తువులను ఎవరికి వారే సొంతంగా తీసుకువస్తున్నారు. ఈ కార్యక్రమంలో జూకారెడ్డి విజయపాల్ రెడ్డి, సుబేదారు చిలకమర్రి కృష్ణమూర్తి, మేజర్ పెరిచెర్ల సూర్యనారాయణ రాజు, మధ్య పరిశ్రమల ఉద్యోగి పర్వతనేని కృష్ణమోహన్, డాక్టర్ పీఎస్ రాజు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మర్రి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైబ్యాక్ పద్ధతితో పంట కొనుగోలు

తూప్రాన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : అయిల్‌పామ్ పంటల కొనుగోలుకు బైబ్యాక్ పద్ధతిలో కంపెనీ ఉత్పత్తులు కొనుగోలు చేసేందుకు ఒప్పందం చేసుకోవడంతో పంట కొనుగోలుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని జిల్లా ఉద్యానశాఖ, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్ సింగ్ పేర్కొన్నారు. బుధవారం తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లిలో అయిల్‌పామ్ మొక్కలను నాటారు. ఒకసారి ప్లాంటేషన్ చేస్తే 30 ఏళ్ల ఆదాయం వస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గంగమల్లు, ఏఈవో సంతోష్‌కుమార్, కంపెనీ మేనేజర్ కృష్ణ పాల్గొన్నారు.

నర్సింంహారెడ్డికి డాక్టరేట్


నర్సింంహారెడ్డి

కొండాపూర్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారుడు నర్సింంహారెడ్డి చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఆసియా వేదిక్ ఇంటర్నేషనల్ కల్చర్ అండ్ రీసెర్చ్ స్ఫూర్తి అకాడమీ (ఏవీఐసీఆర్‌యూ) డాక్టరేట్ అవార్డును ప్రకటించింది. కొండాపూర్ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన నర్సింంహారెడ్డి రాష్ట్ర సాధన కోసం పోరాడి జిల్లా, రాష్ట్రస్థాయి నాయకుడిగా ఎదిగారు. అదే తరహాలో గ్రామంలో జరిగే ఆడపిల్లల పెళ్లికి కానుకగా పుస్తెమట్టెలు, దేవుళ్ల విగ్రహాలు, ఆలయాల నిర్మాణాలు, స్వామి వివేకనంద, మహాత్మాగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు సహాయం చేశారు. ఇవేకాకుండా చాలావరకు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నర్సింంహారెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి ఏవీఐసీఆర్‌యూ సంస్థ ప్రతినిధులు డాక్టర్ రమేష్, ఫిరోజ్, థామస్, శ్రీనివాస్ డాక్టరేట్ అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును 30న నాంపల్లిలో అందజేయనున్నట్లు వెల్లడించారు.

బాధ్యతల నుంచి తప్పుకుంటాం


మాట్లాడుతున్న రామాలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్

మెదక్ అర్బన్, ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ కోదండ రామాలయ పరిరక్షణ కోసం తమ బాధ్యతల నుంచి తప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నామని రామాలయ కమిటీ చైర్మన్ బండ నరేందర్ స్పష్టం చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు, భక్తులు, దాతల సహకారంతో ఆలయ అభివృద్ధికి కమిటీ కృషి చేసిందన్నారు. ఆలయానికి సంబంధించిన ప్రతి పైసా లెక్క రాసి ఉందని, ఎవరైనా, ఎప్పుడైనా లెక్కలు అడిగితే చూపించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. తమపై కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, దయచేసి రామాలయాన్ని ఎండోమెంట్ నుంచి కాపాడాలని రాజకీయ పార్టీలతోపాటు స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎంపీ రఘునందన్‌రావుకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆలయ అర్చకులు భాష్యం మధుసూదన్ చార్యులు, వేద పండితులు కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు మల్లేశం, పురుషోత్తం, శ్రీనివాస్, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.